క్లుప్తంగా

ప్రజలంతా ఐక్యంగా సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జనాబ్ రఫీఖ్

కాకినాడ: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కాకినాడ జమాఅతె ఇస్లామి హింద్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక రాగంపేటలోని సంఘ కార్యాలయంలో ఇఫ్తార్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. దీనికి హిందూ, ముస్లిం, క్రైస్తవ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ముఖ్య వక్త, జమాఅతె ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ రఫీఖ్ మాట్లాడుతూ ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపు నిచ్చారు. రంజాన్, ఉపవాసాల విశిష్టతను తెలియజేశారు. సంఘ సభ్యులు గుల్జార్ బేగం, షెహనాజ్, నజ్మా, సిద్దీకా, జమాత్ నగర అధ్యక్షుడు జనాబ్ షేక్ ఇబ్రహీం, మస్జీద్ అధ్యక్షుడు జనాబ్ బ్రదర్ అహ్మద్, మహ్మద్ షరీఫ్, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

పరస్పర సహకారం అందించుకోవాలి

బోట్‌క్లబ్: రైతులు పరస్పర సహకారం అందించుకోవాలని కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ వీఎస్ఆర్ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక కృషి భవన్‌లో కృషి విజ్ఞాన కేంద్రంలో ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రేష్ఠ గ్రీన్ ఫార్మర్స్ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. శ్రేష్ఠ గ్రీన్ ఫార్మర్స్ నాణ్యమైన ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలన్నారు. ప్రత్తిపాడు వ్యవసాయశాఖ ఏడీ పి.మాధవి మాట్లాడుతూ శాఖ ద్వారా అమలవుతున్న రాయితీలను రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులు వినియోగించుకోవాలని కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థినికి హాల్ టిక్కెట్ అందిస్తున్న అడిషనల్ కమాండెంట్ భద్రయ్య

కాకినాడ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం మెరుగైన ఉత్తీర్ణత సాధించాలని ఏపీఎస్పీ అడిషనల్ కమాండర్ సీహెచ్ భద్రయ్య అన్నారు. రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్ స్కూల్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హాల్ టిక్కెట్లు అందించారు. అసిస్టెంట్ కమాండెంట్ పి.సత్యం, అడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ధర్నా

కాకినాడ సిటీ: దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చాలని గత అసెంబ్లీ సమావేశాలలో అధికార పార్టీ చేసిన తీర్మానాన్ని నిరసిస్తూ బీజేపీ నేతలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం

కొత్తపల్లి: పల్లెల ప్రగతికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల తులసీకుమార్, కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. కొండెవరం శివారు శొంఠవారిపాకలో మూడు సీసీ డ్రైన్‌లకు రూ.15 లక్షలు, కొత్తపల్లిలో రెండు సీసీ రోడ్లకు రూ.8 లక్షలు, వాకతిప్పలో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.3 లక్షల మండల, జిల్లా పరిషత్, పంచాయతీ నిధులతో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. కుల మతాలకు అతీతంగా పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శ్రేణులు సైనికుల్లా పని చేయాలన్నారు. వైస్ ఎంపీపీలు శెట్టిబత్తిన సురేష్‌కుమార్, మాదిరెడ్డి దొరబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంగళి సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, కొత్తపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, చేనేత సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మాదాబత్తుల నూకరాజు, సర్పంచులు పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి సాయం

కొండెవరం శివారు కాశివారి పాకల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి షెడ్డు నిర్మాణానికి గాను మండల కోఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు రూ.10 వేలు అందజేశారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ఉప సర్పంచ్ మేడిశెట్టి శ్రీరాములు తదితరులు ఉన్నారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

సామర్లకోట: మండల పరిధిలో ప్రతీ గ్రామంలోని సచివాలయంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో వాటి పనితీరును డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) పి.నారాయణమూర్తి సోమవారం పరిశీలించారు. ఈ మేరకు వీకే రాయపురం గ్రామంలోని ఆధార్ కేంద్రంను పరిశీలించి, సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సచివాలయంలోని రికార్డులను పరిశీలించి, సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు. వలంటీర్లు ప్రతీ రోజు సచివాలయానికి వచ్చి వారు చేసిన పనులు తెలియజేయవలసి ఉంటుందని చెప్పారు.

అచ్ఛంగా.. స్వచ్ఛంగా..

- జీజీహెచ్‌లో శుభ్రతకు ప్రశంసలు
- సత్ఫలితాలిస్తున్న అధికారుల పర్యవేక్షణ

కాకినాడ క్రైం: ఇక ఛీదరింపులు లేవు.. ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి అంతకన్నా లేదు.. సరికొత్త ప్రణాళికతో కాకినాడ జీజీహెచ్‌లో పారిశుధ్య నిర్వహణ అదిరింది. వార్డులన్నీ స్వచ్ఛతతో మెరిసిపోతున్నాయి. పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వ నిర్దేశిత యాప్‌లలో రియల్ టైమ్ ఫొటోల నమోదు, నేరుగా రాష్ట్ర శాఖతో సహా ఆసుపత్రి అధికారుల పర్యవేక్షణ సత్ఫలితాలనిచ్చింది. నీరసించిన రోగిని ప్రతి వార్డు అద్దంలా ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ ఆసుపత్రుల తరహాలో అత్యుత్తమ సేవలు అందిస్తానంటూ భరోసా ఇస్తోంది. కొన్నితరాలుగా జీజీహెచ్‌లో సేవలు పొందిన రోగులు పారిశుధ్య నిర్వహణలో ప్రస్తుతం చోటు చేసుకున్న మార్పులు చూసి ఆనందిస్తున్నారు. ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తున్నారు. జీజీహెచ్‌కు ఒక రోజులో కనీసం 3,500 మంది ఓపీ సేవలు పొందుతున్నారు. వారిలో నగర వాసుల సంఖ్య కనీసం 1,900 నుంచి 2,200 మధ్య ఉంటుంది. అలాగే 2,800 మంది ఓపీ కోసం చేరితే వారిలో నగర వాసుల చేరిక 1,400 పైమాటే. 54 వార్డులున్న ఆసుపత్రిలో అధికారికంగా 1,055 పడకలున్నా 1,300 మంది వరకూ రోగులకు అదనపు పడకలు ఏర్పాటు చేసి నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణ బాధ్యతను ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో ఏడుగురు నర్సుల ప్రత్యేక బృందం పర్యవేక్షిస్తోంది. వార్డుల స్థాయిలో 150 మంది సిబ్బంది నిత్యం సేవలు అందిస్తున్నారు.



అద్దంలా మెరిసిపోతున్న ఈఎన్‌టీ వార్డు

అదే మార్పునకు కారణం

ప్రధాన ఆసుపత్రుల్లో పారిశుధ్యాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. సాంకేతిక సాయంతో కచ్చితమైన పారిశుధ్య స్థితిగతులను నమోదు చేస్తోంది. అంతేకాక ఆసుపత్రులకు ఏ రోజుకారోజు మార్కులు కేటాయిస్తోంది. టీంలో ఉన్న నర్సులకు ఏపీ సర్వీసెస్ యాప్ లాగిన్ కేటాయించి రోజులో నిర్ణీత సమయానికి వార్డుల ఫొటోలు తీసి అప్లోడ్ చేయాలని రాష్ట్ర శాఖ సూచించిందని ఈ వ్యవస్థను పర్యవేక్షిస్తున్న ఆర్ఎంవో, ఆసుపత్రి ఇన్‌చార్జి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ రాహుల్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి తూ.చా తప్పకుండా చేపట్టిన చర్యలు ఎంతో సత్ఫలితాలను ఇచ్చాయి. గడచిన కొన్నాళ్లుగా వందకు గాను ప్రతి రోజు 96, 97 మార్కులు సాధిస్తూ రాష్ట్ర స్థాయిలో జీజీహెచ్ ప్రత్యేకతను చాటుతోంది. ఇది అందరి ప్రశంసలు అందుకుంటోంది.



గైనిక్ విభాగ వార్డులో శుభ్రం చేస్తూ..

మొదటి స్థానమే లక్ష్యం



రాష్ట్ర స్థాయిలో కాకినాడ జీజీహెచ్‌కు పారిశుధ్య నిర్వహణలో సమున్నత స్థానం దక్కింది. కార్మికుల నిబద్ధత, అధికారుల పర్యవేక్షణతోనే ఇది సాధ్యమైంది. కొన్నాళ్లుగా వందకు గాను కనిష్ఠంగా 96, గరిష్ఠంగా 97 మార్కులతో ముందున్నాం. పారిశుధ్య నిర్వహణలో కాకినాడ జీజీహెచ్‌ను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలపాలన్నదే లక్ష్యం. అధునాతన పరికరాల వినియోగాన్ని పారిశుధ్య నిర్వహణలో భాగం చేయడం సత్ఫలితాలిస్తోంది.

–డాక్టర్ హేమలతాదేవి,
సూపరింటెండెంట్, జీజీహెచ్ కాకినాడ

అధునాతన పరికరాలతో..

పారిశుధ్య నిర్వహణకు అధునాతన పరికరాలను వినియోగిస్తున్నారు. వాక్ బిహైండ్ స్క్రబ్బర్ డ్రయర్, రూట్స్ రైడ్ ఆన్ స్క్రబ్బర్ డ్రైవర్ మెషీన్, త్రీ బకెట్ సిస్టమ్ యంత్రాలు, సింగిల్ డిస్క్ ఫ్లోర్ స్క్రబ్బర్ యంత్రాలను వాడుతున్నారు. తాజాగా మరిన్ని పరికరాలు సమకూర్చి పారిశుధ్య సేవలను మరింత మెరుగుపరుస్తున్నారు. ప్రతి వార్డు శుభ్రతపై నేరుగా వాట్సాప్ ఫొటోల ద్వారా సిబ్బంది పంపాలి. పనితీరు ఆధారంగా సీఎస్ఆర్ఎంవో వారికి మార్కులు కేటాయిస్తారు. ఈ మార్కులు రిపబ్లిక్ డేతో పాటు పంద్రాగస్టు ఇతర సందర్భాల్లో గుర్తింపు పత్రాలు ఇచ్చినపుడు పరిగణనలోకి తీసుకుంటారు. గత రిపబ్లిక్ డే రోజున జీజీహెచ్ నుంచి 11 మంది పారిశుధ్య కార్మికులు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

సమస్యల పరిష్కారానికే 'స్పందన'



వినతులు స్వీకరిస్తున్న నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు అన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో వివిధ శాఖల అధికారులతో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయా విభాగాధిపతులకు సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిర్ణీత వ్యవధిలో సమస్యలు పరిష్కారం కావాలన్నదే ప్రభుత్వ అభిమతమన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కాకినాడ: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ 3020 కార్యదర్శి, ట్రినిటీ హాస్పిటల్ అధినేత రిక్కి గూటం సోమవారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు తదితర సామగ్రిని అందజేశారు. వీటిని స్థానిక మెక్లారిన్ స్కూల్‌లో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు పెద్దపీట



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని 11 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.22 లక్షల విలువైన చెక్కులను సోమవారం అందజేశారు. రమణయ్యపేటలోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా చాలా వరకూ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఎవరికైనా ఆరోగ్యశ్రీ వర్తించకుంటే వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆదుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీపీ గోపుశెట్టి పద్మజ బాబ్జీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా'



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి తదితరులు



సమావేశానికి హాజరైన స్వయం సహాయక సంఘాల సభ్యులు

- సీఎం జగన్ పాలనలో మహిళలకు పెద్దపీట
- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: అతివల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుందని ఎంపీ వంగా గీత అన్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ సమీపంలోని పైడా గ్రౌండ్స్‌లో రూ. 25.32 కోట్ల విలువైన వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరులు హాజరయ్యారు. తొలుత మూడో విడత రుణమాఫీ మొత్తాన్ని విడుదల చేసిన సీఎం జగన్ చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందన్నారు. రాజకీయ ప్రాధాన్యం నుంచి అన్ని పథకాలూ మహిళలకే అందేలా సీఎం తీసుకున్న నిర్ణయం ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రుణ మాఫీ చేస్తానని 2014లో చంద్రబాబు హామీ ఇచ్చి మహిళలను మోసం చేశారన్నారు. సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాట ప్రకారం క్రమం తప్పకుండా మూడో విడతగా వైఎస్సార్ ఆసరా ద్వారా రుణ మాఫీ చేశారన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఒకప్పుడు వైఎస్సార్, ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని విధాలా అగ్రపీఠం వేశారన్నారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడంతో పాటు కుటుంబ బాధ్యతలను నెరవేర్చడంలో ప్రభుత్వ పథకాలు ఎంతగానో తోడ్పడుతున్నాయన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా ద్వారా మూడు విడతల్లో ఇప్పటి వరకూ రూ.75.23 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. అర్బన్ పరిధిలో మూడో విడత 3,595 స్వయం సహాయక సంఘాలకు గాను 36,751 మంది లబ్ధి పొందుతున్నారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్థినీడి సుజాత, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు మీసాల శ్రీదేవి, బొర్రా రమణ, కామాడి సీత, ఎంజీకే కిశోర్, నందం, కొప్పనాతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలంతో విజయం సొంతం

కాకినాడ లీగల్: సంకల్ప బలంతో విజయం సొంతమవుతుందని, దానికి గ్రంధి సుబ్రహ్మణ్యం నిదర్శనమని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి పి.కమలాదేవి అన్నారు. న్యాయవాది గ్రంధి సుబ్రహ్మణ్యం ఇటీవల అదనపు జిల్లా జడ్జిగా ఎంపికైన సందర్భంగా సోమవారం కాకినాడ బార్ అసోసియేషన్ హాలులో బార్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. అదనపు జిల్లా జడ్జిలు కమలాదేవి, హరినారాయణ మాట్లాడుతూ పట్టుదలతో చదివి న్యాయమూర్తిగా అర్హత సాధించడం అభినందనీయమన్నారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయం మేరకు న్యాయవాదిగా వృత్తిలోకి వచ్చినప్పటి నుంచి సీనియర్ న్యాయవాది ఏలూరి సుబ్రహ్మణ్యం వద్ద ప్రాక్టీస్ చేస్తూ వచ్చానన్నారు. 2006 నుంచి అనేకసార్లు న్యాయమూర్తి పరీక్షలు రాసి విజయం సాధించకపోయినా నిరాశ చెందకుండా నిరంతరం చదివి అదనపు జిల్లా జడ్జిగా అర్హత సాధించానన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, జనరల్ సెక్రటరీ కె.శంకు సింగ్, ఉపాధ్యక్షుడు కేబీ ప్రతాప్‌కుమార్, జాయింట్ సెక్రటరీ సుదీన శ్రీనివాస్, మహిళ ప్రతినిధి వసంత తదితరులు పాల్గొన్నారు.



గ్రంధి సుబ్రహ్మణ్యంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా జడ్జిలు కమలాదేవి, నిఖిత, న్యాయవాదులు

త్వరలోనే ప్రింటింగ్ క్లస్టర్ ప్రారంభం

కాకినాడ రూరల్: రెండు తెలుగు రాష్ట్రాలలో తొలిసారిగా కాకినాడ రూరల్ రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీసత్యదేవా ప్రింటింగ్ క్లస్టర్ త్వరలోనే అందుబాటులోకి రానుందని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బి.హరిధర్‌రావు, డీఐసీ జనరల్ మేనేజర్ టి.మురళీ తెలిపారు. ఈ ప్రింటింగ్ క్లస్టర్‌ను సోమవారం సందర్శించిన వారు జపాన్ నుంచి వచ్చిన యంత్రాలను పరిశీలించారు. రూ.14.76 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేశారని, దీనిద్వారా కాకినాడ జిల్లా వాసులకు నాణ్యమైన ప్రింటింగ్ సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. శ్రీసత్యదేవా క్లస్టర్ అసోసియేషన్ ఎండీ కోరుమిల్లి బాలప్రసాద్, డైరెక్టర్ జీవీఆర్ మూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రింటింగ్ క్లస్టర్‌ను ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు.



రమణయ్యపేట ప్రింటింగ్ క్లస్టర్‌లో కంప్యూటర్లను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ జెడ్ఎం హరిధర్‌రావు

పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించొద్దు

కాకినాడ సిటీ: పోలవరం జాతీయ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసినా, ఎత్తు తగ్గించినా తెలుగు ప్రజల ఉసురు కేంద్ర ప్రభుత్వానికి తగులుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించి కేంద్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు. పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తుతో పూర్తి స్థాయిలో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎత్తు తగ్గిస్తే ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 196.60 టీఎంసీల నుంచి 92 టీఎంసీలకు పరిమితం అవుతుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం, పి.సత్యనారాయణ, పీఎస్ నారాయణ, పప్పు ఆదినారాయణ, ఎంఎస్ రామదాసు, జ్యోతి, మేరీ రమణ తదితరులు నాయకత్వం వహించారు.



పోలవరం ఎత్తు యథాతథంగా ఉంచాలంటూ ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పాడి రైతుపై దాడి

కరప: ఓ వ్యక్తి దాడిలో గాయపడిన పాడి రైతు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కరప ఎస్ఐ నౌడు రామకృష్ణ కథనం ప్రకారం... అరట్లకట్ట గ్రామానికి చెందిన గోపి వెంకట్రావు అరట్లకట్ట– శహపురం రహదారిలో రోడ్డు పక్కన పాడి గేదెను కట్టుకుని, సోమవారం ఉదయం పాలు తీస్తున్నాడు. ఈ నేపథ్యంలో పెదపూడికి చెందిన ఓ వ్యక్తి అదే రోడ్డులో మోటార్ సైకిల్ వెళుతూ హారన్ కొట్టడంతో పాడి గేదె బెదిరిపోయింది. దీంతో పాలు తీసే సమయంలో హారన్ కొట్టడం ఏంటని వెంకట్రావు ప్రశ్నించాడు. మోటార్ సైకిలిస్ట్ కోపంతో పాడిరైతు వెంకట్రావును రాయితో తలపై కొట్టడంతో రక్తపు గాయమైంది. క్షతగాత్రుడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు.

వ్యాయామంతో ఆరోగ్యం



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వ్యాయామంతో చక్కని ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. రమణయ్యపేట ఎస్ఆర్ఎంటీ మాల్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఆదివారం రాత్రి విల్సన్ జిమ్ ఆధ్వర్యంలో ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ద్వారా నిర్వహించిన జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు జ్ఞాపికలను అందించారు. ఆయన పాటు సీవైఎఫ్ ఇంటర్నేషన్ డైరెక్టర్ మూర్తిరాజు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పడాల జాషువా, గగారిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ కాకినాడ జోనల్ స్థాయిలో 12 జిల్లాలకు చెందిన బిల్డర్స్‌తో పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు విల్సన్‌ను అభినందించారు. బాడీ బిల్డింగ్, మెన్స్ ఫిజిక్ విభాగాల విజేతలుగా విల్సన్ జిమ్‌కు చెందిన ఆది, శివకుమార్‌లు ఎంపికయ్యారు. వీరికి ట్రోఫీతో పాటు రూ.30 వేలు, రూ.15 వేలను బహుమతులుగా అందించారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సామర్లకోట: కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 31వ తేదీ ఉదయం 11.30 గంటలకు జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన గత నెలలో వాయిదా పడిన అంశాలతో పాటు మరో ఆరు అంశాలను అజెండాలో పొందుపరచినట్టు తెలిపారు. అజెండాలోని అంశాలపై చర్చించడానికి అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

స్వచ్ఛ సంకల్పం ప్రతిజ్ఞ

సామర్లకోట: స్థానిక 13వ వార్డు బలుసులపేటలోని అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఆ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 31 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం ప్రారంభం అవుతున్న సందర్భంగా సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలతో పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతామని, బహిరంగ మలవిసర్జనకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.

నాటక రంగాన్ని ఆదరించండి

కాకినాడ రూరల్: ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన నాటక రంగాన్ని ప్రజలు ఆదరించాలని నాటక కళాకారుడు ఎ.దక్షిణామూర్తి అన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన కళలలో నాటకం ప్రధానమైందని అన్నారు. సమాజ కోణం, సంస్కృతిలను ఏకం చేస్తూ సమకాలీన సమస్యల పరిష్కారానికి ప్రతిబింబంగా నాటక రంగం నిలిచిందన్నారు. మరో కళాకారుడు కె.పుల్లారావు మాట్లాడుతూ నాటక రంగం ద్వారానే నేర్చుకున్న పాఠాలతో ఎందరో కళాకారులు తెలుగు తెరపై ఓ వెలుగు వెలిగారన్నారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో కళాకారులు దక్షిణామూర్తి, సీహెచ్ కృష్ణవేణి, కె.పుల్లారావు, పీసీహెచ్ సత్యనారాయణ, వై.వాసు తదితరులను సత్కరించారు. ఎస్.శ్రీనగేష్, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, వై.కృష్ణ, అడబాల సత్యనారాయణ, రాఘవరావు పాల్గొన్నారు.



నాటక రంగ కళాకారులను సత్కరిస్తున్న అడబాల రత్నప్రసాద్ తదితరులు

సంపద తయారీ కేంద్రాలు నిర్వహించాలి

సామర్లకోట: ప్రతి గ్రామంలో సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటిని విజయవంతంగా నిర్వహించాలని డివిజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీఓ) పి.నారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఉండూరు సంపద తయారీ కేంద్రం వద్ద సోమవారం కిర్లంపూడి మండలంలోని మోడల్ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ సంకల్పంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు అవగాహన ఉండాలన్నారు. రోడ్లపై, డ్రైనులోను చెత్త వేస్తే అపరాధ రుసుం విధించాలని సూచించారు. కిర్లంపూడి మండలాన్ని మోడల్ మండలంగా ఎంపిక చేసి అన్ని గ్రామాలకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. సంపద తయారీ కేంద్రాల్లో ఉత్పత్తి చేస్తున్న వర్మీ కంపోస్టుపై రైతులల్లో అవగాహన పెంచాలన్నారు. దీనిలో భాగంగానే రైతు భరోసా కేంద్రాలలోని వీఏఏలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. సేంద్రియ వ్యవసాయ దిగుబడులకు అదనపు ధర వస్తుందన్నారు. ప్రస్తుతం విక్రయిస్తున్న వర్మీ కంపోస్టును కేజీ రూ.10 నుంచి రూ.5కి తగ్గించి రైతులకు విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మెట్ట ప్రాంతాలలో సాగు చేసే అరటి, బొప్పాయి, మామిడితో పాటు కూరగాయలు, పూల మొక్కల పెంపకానికి సేంద్రియ ఎరువులు వాడే విధంగా చూడాలన్నారు. ఈ మేరకు ప్రతీ గ్రామంలో ఉన్న సచివాలయ సిబ్బంది ద్వారా వలంటీర్లతో రైతులలో అవగాహన పెంచాలన్నారు. వర్మీ కంపోస్టు ఏడాదికి మించి నిల్వ ఉంటే సారం పోతుందని హెచ్చరించారు. కిర్లంపూడి, బూరుగుపూడి, సోమరాయనిపేట, తామరాడ, సుంగరాయనిపాలెం గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది హాజరయ్యారు. కిర్లంపూడి ఎంపీడీఓ పి.సతీష్‌బాబు, ఈఓపీఆర్డీ పి. శ్రీనివాసరావు, ఉండూరు గ్రామ సర్పంచ్ సత్యాడి ధన లక్ష్మీ, ఉపసర్పంచ్ కొప్పిరెడ్డి రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు.



స్వచ్ఛ సంకల్పం శిక్షణలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి

రేపు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: పీబీ దేవం గ్రామంలో ఈ నెల 29న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు మలకల సూరిబాబు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనపర్తికి చెందిన రామాదేవి ఆసుపత్రి వైద్యులచే వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శిబిరం జరుగుతుందన్నారు. వైద్యురాలు ఎం.రామాదేవి మహిళలకు సంబంధించిన అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అదే విధంగా డాక్టర్ జి.కృష్ణారావు వివిధ వ్యాధులకు పరీక్షలు చేస్తారన్నారు. రక్త పరీక్షలు, మందులు, స్కానింగ్ ఉచితమన్నారు.